సాయంకాలం ఐదు గంటలు కావస్తున్నది. ఆకాశం నిండా మేఘాలు కమ్ముకొంటున్నాయి. వర్షం వచ్చేలా ఉంది. బయట వరండాలో నిలబడి పనిమనిషి పాపమ్మతో మాట్లాడుతు న్నది రేవతి.

"అమ్మా! అమ్మగారూ! ఒక్కసారి ఇటు చూడండమ్మా!... ఆ పిలుపు ఆత్మీయంగా గుండె లోతుల నుంచి వినవస్తున్నట్లనిపిం చింది రేవతికి. ప్రపంచంలో ఏ ప్రేమకు, మరే వస్తువుకూ లొంగని ఆ పిలుపులోని



# అమ్మ

'అమ్మ' అనే రెండక్షరాలలో ఎంతటి మహత్తు ఉన్నదో అది అనుభవించే వారికే తెలుస్తుంది.

"అమ్మగారూ!... ఈసారి దీనమైన పిలుపు.

"ఫో... ఫో...! అటు పోయి అడుక్కో - ఇంటి పనిమనిషిని నాకే వణ్ణం మిగన్నేదు. నీకే టి పెట్టాల? ఆ ఈది కెల్లు పో...' అంటున్న పాపమ్మను వారించింది రేవతి.

"నేనడుక్కోడానికి రాలేదమ్మా... మీ ఇంట్లో ఏదైనా పనుంటే ఇప్పించండమ్మా! చేసుకొంటాను". పదేళ్ళు నిండని పసిప్రాయం. పసిమి ఛాయ, కళకలిగిన మొహం. తైలసంస్కారం లేని జుట్టు, మాసిన చొక్కా.

ఏంకావాలిరా నీకు? అన్నం పెట్టనా అడిగింది రేవతి.

కాదమ్మా! మీ ఇంట్లో ఏదైనా పనుంటే ఇప్పించండమ్మా" దీనంగా మొహం పెట్టి అడిగేడు అంజి.

ఆ కుర్రవాడ్ని చూస్తే జాలేస్తున్నది రేవతికి.

"ఏటేటి! పనా? ఏటిపని సేత్తవు నాయనా నువ్వు? ఇక్కడ నాకే పనినేక కూకుంతన్న! "నీకేటి పని సూపాల! ఎల్లెల్లు... విసురుగా ఆ పిల్లాడి మొహం మీద అనేసింది పాపమ్మ.

"పాపమ్మా! నువ్వెళ్ళి కొట్లో గోధుమపిండి పట్టుకురా పో...!"

"ఆ! పోతాలేగానీ ఆ పిల్లగాడ్ని ఏటి సేత్తరు మీరు? ఇట్టాగే పని సేత్తనని ఇంటోదూరి సేతి కందినయ్యన్నీ ఏసకపోతరు" ముందాగుంటడ్ని పొమ్మనండమ్మా...

"పాపమ్మా! నువ్వెళ్ళి చెప్పిన పనిచెయ్... ఫో...!"

గొణుక్కుంటూ వెళ్ళిపోయింది పాపమ్మ.

"నువ్వేంపని చేస్తావురా!" కుర్రవాడ్ని అడిగింది రేవతి.

"అమ్మా! అయ్యగారి బూట్లు తుడుస్తాను, కారు కడుగుతాను, స్నానానికి నీళ్ళుతోడతాను, బజారెళ్ళి కావలసిన సరుకులు తెచ్చి పెడతానమ్మా!" వాడి జాలి చూపులు రేవతి మనసును కదిలించివేశాయి.

"సరే! నీకు అమ్మా, నాన్నా ఉన్నారా?

లేరమ్మా... ఓ బామ్మ ఉంది. దానికి జర మొచ్చి మంచంలో ఉంది. మా గూడెంలో వాళ్ళే డాక్టరుకు చూపిస్తున్నారమ్మా! నేను కూడా పని చేస్తే డబ్బులొస్తాయిగా! మా బామ్మకు బలం టానిక్కు కొనిపెడతాను".

వాడి మాటలకు జాలేసింది రేవతికి. "నీ పేరేమిటి?" అడిగింది.

"ఆనంద్. గూడెంలో వాళ్ళందరూ నన్ను "అంజీ!" అని పిలుస్తారమ్మా!"

"సరే! ఈ పూటకు అన్నం పెడతాను. తినేసి వెళ్ళి, రేపటి నుంచి పనిలోకి రా... అంటూ వాడ్ని వరండాలో కూర్చోబెట్టి పెరుగన్నం పెట్టింది రేవతి.

"అమ్మగారూ! అందరూ నన్ను ఫో... ఫో" అని తరిమేవాళ్ళే. మీరేనమ్మా సక్కగా మాట్లాడి అన్నం పెడుతున్నారు.

ఆ పసి మనసులోని ఆవేదనకు మరింత

**కోకా విమలకుమారి**

జాలేసింది రేవతికి - ఈ దేశంలో అనాథలెందరో ఉన్నారు. తల్లీ తండ్రీ చనిపోయి మిగిలిపోయిన పిల్లలు, మగవాళ్ల మోసానికి బలైన అమ్మాయిలు కనిపడేసిన పసికందులు, పేదరికం నీడలో పెంచలేని తల్లులు వదిలేసిన పిల్లలు, ఇలా ఎందరో అభాగ్యులు - ఆలోచిస్తున్న రేవతి హృదయం ఆర్ద్రమయింది - వంటింట్లోకి నడిచి వంట మొదలుపెట్టింది. కానీ ఆమె మనసు నిండా ఎడతెగని ఆలోచన్లు ముసురుతున్నాయి.

రేవతి భర్త రవీంద్రబాబు రైల్వే కాంట్రాక్టరు. అనారోగ్యంతో బాధపడుతున్న అతని తల్లి అహల్య, పనిమనిషి పాపమ్మ ఆ ఇంటి సభ్యులు. పాపమ్మ నమ్మిన బంటులా పగలంతా పనిచేసి, సాయంకాలం ఇంటికి వెళుతుంది. పెద్ద బంగళా - కారు. డబ్బుకు లోటు లేదు. కాలక్షేపం కోసం అప్పుడప్పుడూ మహిళా మండలికి వెళ్తుంది రేవతి. అన్నీ ఉన్నా ఆమె మనసులో ఏదో వెలితి. పెళ్ళయి ఏడేళ్ళవుతున్నా పిల్లలు కలగలేదు. ఓ అనాథ బిడ్డనెవరినైనా తెచ్చి పెంచుకొందామంటే భర్తకు ఇష్టం లేదు. "రేవతీ! నాకో మనవడ్నివ్వమ్మా!" అంటూ అత్తగారి ఆరాటం. అన్నింటినీ మించి తన మనసులో గూడు కట్టుకొన్న బాధ ఎవరితోనూ చెప్పుకోలేనిది. వంటయిందనిపించి హాల్లోకి వచ్చింది రేవతి.

పాపమ్మ గిన్నెలన్నీ టేబుల్ మీద సర్దింది. కంచాలు తెచ్చి బల్లమీద బోర్లిస్తూ మధ్య మధ్య రేవతి మొహంలోకి చూస్తున్నది.

'పాపమ్మా! మిక్సీలో అన్నీ వేసి అక్కడపెట్టానుగానీ కొబ్బరిచెట్నీ చేసి పట్టుకురా!'



రమ్యసాహితి సంస్థ పెనుగొండలో నిర్వహించిన జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రథమ విజేత శైలజామిత్రకు అవార్డు అందజేస్తున్న డా॥ రామచంద్రరాజు, రసరాజు, కార్యదర్శి ఎం. రాజేశ్వరి, ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి.

అట్టాగేనమ్మా... "అమ్మగారూ! తమరదోలా ఉన్నారేటి? వంట్లో బాగోనేదా? ఏటి సెయ్యాలో నాకు సెప్పేసి మీరెల్లి కాసేపు పండుకోండమ్మా... నేను చూసుకొంటాగా!

"వంటంతా అయిపోయింది పాపమ్మా! ఆ చెట్నీ ఒకటి చెయ్ చాలు – అన్నట్లు అత్తయ్యకు ఆకలేస్తోందేమో అడిగి అన్నం వడ్డించు" అంటూ తన గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది రేవతి.

మరునాడుదయం ఎనిమిది గంటలకే అంజి వచ్చేశాడు. వరండాలో నిలబడి "అమ్మా! నేనొచ్చేశానమ్మగారూ!" అంటూ పిలిచాడు. లోపల ఎక్కడో పూజ చేసుకొంటున్న రేవతికి "అమ్మా! అనే పిలుపు వెచ్చని వేసవి తాపాన అలసిన మోముపై చల్లని పన్నీరు చిలకరించినంత హాయిగా అనిపించింది. పూజ ముగించి వరండాలోకి వచ్చి నిలబడింది.

"అమ్మగారూ! పని చెప్పండి చేస్తాను" అంటున్న అంజిని చూసి వరండాలోకి వచ్చిన రవీంద్ర రేవతీ! ఎవడు వీడు? అని ప్రశ్నార్థకంగా మొహంపెట్టాడు.

పనికుర్రాడండీ! మనింట్లో పనిచేయడానికి వచ్చాడు.

"వీడా? నిండా పదేళ్ళు లేవు... వీడేం పని చేస్తాడు"

"అయ్యగారూ! బజారు పన్లు, మీ పన్లు అన్నీ చేస్తానండి".

"పోనీలెండి పాపం! చిన్నవాడు. వాడికెవ్వరూ లేరంట" రేవతి అందుకొంది.

"ఓహో! సంఘసేవా? సరే! నీ ఇష్టం అంటూ లోపలికి వెళ్ళిపోయాడు రవీంద్ర.

తన పనిపాటల్తో, చక్కని మాటలతో పది రోజుల్లోనే పనిమనిషి పాపమ్మ దగ్గర నుంచి ఆ ఇంట్లో అందరికీ తలలో నాలుకలా అల్లుకుపోయాడు అంజి. ఎవరికి ఏపని కావలసి వచ్చినా అంజిని పిలవవలసిందే. రాత్రి ఎనిమిది గంటల వరకూ ఉండి ఇంటికి వెళ్ళిపోతాడు. అన్నిటికంటే వాడు రేవతిని పిలిచే "అమ్మా! అనే పిలుపు ఆమెకెంతో హాయిగా అనిపిస్తున్నది.

అంజి ఆ ఇంటికి వచ్చి ఆరు మాసాలయింది. ఓ రోజు సాయంకాలం రేవతి దగ్గరకు వచ్చి ఏదో చెప్పాలని సందేహిస్తూ నిలబడ్డాడు.

"అంజీ! ఏమిటి? ఏమైనా కావాలా? డబ్బులా... చెప్పరా!"

"అబ్బే అదేం కాదమ్మా! మీరిచ్చిన డబ్బుతో డాక్టరుగారు మా బామ్మకు మంచి మందులిస్తున్నారమ్మా! మీరోసారి మా గూడెం వచ్చి మా బామ్మను చూడాలి. బామ్మను తీసుకువద్దామంటే అదేమో లేచి నడవలేకపోతున్నది. నడవడానికి ఇంకా నెలరోజులు పడుతుందని డాక్టరుగారు చెప్పేరమ్మా! మీరు చాలా మంచోళ్ళని, నన్ను బాగా చూసుకొంటున్నారని మీ గురించి మా బామ్మతో చెప్పేను. ఆయమ్మనొకసారి చూసి దణ్ణం పెట్టుకోవాలి. ఆయమ్మగార్ని ఎట్టాగయినా ఒకసారి మనింటికి తీసుకురారా! అని అప్పుడప్పుడు అంటుందమ్మా! ఆమాట మీతో చెబుదామని" అంటూ రెండు చేతులూ జోడించి నమస్కారం చేస్తూ "ఇట్లా అన్నానని తమరేమీ అనుకోవద్దమ్మా!" అని అంటూ ఉంటే వాడి కళ్ళల్లో నీళ్ళు.

తన చేతులతో వాడి రెండు చేతులూ పట్టుకొని "అంజీ! ఎందుకురా! ఏడుస్తావ్? నేనేదో ఒకరోజు తప్పకుండా మీ బామ్మ దగ్గరకు వస్తాను – సరేనా? కళ్ళు తుడుచుకో – చదువుతో

బాటు చక్కని సంస్కారం నేర్పిందిరా నీకు నీ బామ్మ - మీ బామ్మ చల్లగా ఉంటుంది. ఆమె కేం కాదు. "అయ్యగారొచ్చే వేళయింది. గేటు దగ్గరకు వెళ్ళు. పో...!" అంటూ వాడ్ని పంపించింది.

కారు శబ్దం వినగానే గేటు తెరిచి, కారులో నుంచి బ్రీఫ్‌కేస్ అందుకొన్నాడు అంజి.

ఓ రోజు త్వరగా పని ముగించి, రవీంద్ర రాగానే భోజనం వడ్డించి అడిగింది రేవతి. "ఏవండీ! అంజి వాళ్ళబామ్మ నన్ను చూడాలని ఆశపడుతున్నదట. లేచి నడవలేని పరిస్థితి ఆమెది. ఓసారి వెళ్ళి చూసి వస్తాను".

"ఏమిటీ... ఆ గూడేనికి నువ్వు వెళ్తావా రేవతీ? ఎవరైనా చూస్తే బాగుండదు. నడవగలిగినప్పుడు ఆవిడే ఇక్కడకు వస్తుందిలే అంటూ సున్నితంగా తన అయిష్టాన్ని తెలియజేసాడు రవీంద్ర.

అలాంటి సమాధానం వస్తుందని అనుకోని రేవతికి కొంత బాధనిపించింది. ఈ విషయమై భర్త మనసు నొప్పించాలనుకోలేదు. ఏదో ఒక రోజు భర్తకు తెలియకుండా గూడెం వెళ్ళిరావాలనుకొన్నది రేవతి.

హాల్లోకి వచ్చి పేపరు తీసుకొని కూర్చున్నదే గానీ ఆమె మనసు నిండా ఆలోచనలు ముసురుతున్నాయి.

"అమ్మగారూ! పేపరు తిరగేసి పట్టుకొన్నారమ్మా!" బయటి నుంచి కూరగాయల సంచితో వచ్చిన అంజి చెప్పేవరకూ తన చేతిలోని పేపరువైపు చూడనేలేదు. శూన్యంలోకి చూస్తూ ఆలోచించడమే సరిపోయింది రేవతికి.

కన్నులు తెరిచి తుమ్మడం అసాధ్యం.

"అంజీ! నువ్వు చదువుకొన్నావా?" అడిగింది రేవతి.


అయిదో క్లాసు వరకూ చదువుకొన్నానమ్మా! క్లాసులో అందరికంటే ఫస్టులో ఉండేవాడ్ని. మా బామ్మ ఇప్పుడు కూడా చదువుకోమంటది. నేను చదువుకొంటూ కూర్చుంటే బామ్మనెవరు చూసుకొంటారు చెప్పండి. "నేనుంటే వాళ్ళ స్కూలుకు మంచి పేరొస్తుందని నన్ను బడికి పంపించమని మా తెలుగు మాష్టారొచ్చి బామ్మతో చెప్పి పోతున్నాడంట - రోజూ పొద్దున్నే అయ్యగారు లేచేసరికి తెలుగు పేపర్లో ముఖ్యమైన విషయాలన్నీ చదివేస్తున్నాను. ఆ చదువు చాల్లెండమ్మా నాకు."

"అంజీ! నిన్ను నేను చదివిస్తాను. చదువుకొంటావా?"

భలేవారమ్మా! మీరు... నేను చదువుకొంటూ కూర్చుంటే అయ్యగారి పన్లు, బయటి పన్లూ ఎవరు చేస్తారు చెప్పండి? వద్దమ్మా... అట్టా అనకండి, అయ్యగారికి తెలిసిందంటే కోప్పడతారు.

రవీంద్ర విషయం గుర్తుకొచ్చేసరికి ప్రస్తుతం ఆమె మనసులోని ఆలోచనలను ప్రక్కకు నెట్టింది.

ఆ రోజు ఉదయం రవీంద్ర ఆఫీసుకు వెళ్ళగానే త్వరగా పని ముగించి, అంజిని వెంటబెట్టుకొని ఆటోలో వాళ్ల గూడేనికి బయలుదేరింది రేవతి. ఆ ఇంటి ముందు ఆటో ఆగీ ఆగగానే రివ్వున లోపలికి పరిగెట్టేడు అంజి. "బామ్మా! బామ్మా! అమ్మగారొచ్చేరే... ఇక్కడ కుర్చీ ఏమైంది? అంటూ గబగబా ప్రక్కింట్లోకి పరిగెట్టి కుర్చీతెచ్చి బామ్మ మంచం దగ్గరగా వేశాడు. "బామ్మా! అమ్మగారు టీ తాగుతారు. పక్కింటి లచ్చిని పిలిచి టీ కాయమని చెప్ప




నా?" అంటూ మళ్ళీ పక్కింట్లోకి పరిగెత్తేడు.

"అమ్మగారూ! ఇన్నాళ్టికి ఈ పేదరాలి మీద దయకలిగిందా అమ్మా?" అంటూ మెల్లిగా లేచి కూర్చుంది ఆదెమ్మ. ఈ జబ్బు చేసిన దగ్గర నుంచీ చూపు సరిగా ఆనడం లేదమ్మా!" అంటూ నుదిటిపై అరచేతిని ఆన్చి రేవతివైపు చూసింది. కళ్ళు పెద్దవి చేసుకొని ఆశ్చర్యంతో "రేవతీ! నువ్వా?" అంటూ అవాక్కయింది బామ్మ.

"ఆంటీ! అంజి బామ్మంటే మీరేనా!"

"అవునమ్మా! అంతా చిత్రంగా ఉంది. ఆ భగవంతుని లీలలు ఎప్పుడు ఎలా ఉంటాయో ఊహించలేము".

అయితే అత్తయ్యా! అంజి... అంజి...

అవునమ్మా! అంజి స్వయానా నా కొడుకు బిడ్డ. నువ్వు కన్న బిడ్డేనమ్మా!

"అత్తయ్యా! ఇది నిజమా? ఆశ్చర్యంగా అడిగింది.

నీకు ఇంకా నమ్మకం కుదర్లేదా రేవతీ? నీమీదొట్టు – నీకు ఇంకా ఋజువు కావాలంటే చూసుకో – వాడి వీపు మీద ఉన్న వేపకాయంత పుట్టుమచ్చ. నీకు గుర్తేగా?".

నాకిదంతా ఒక కలలా ఉందత్తయ్యా! కానీ "నాకెంత సంతోషంగా ఉందో చెప్పలేను!".

"బామ్మా! బామ్మా!" ఇదిగో లచ్చక్కను తీసుకువచ్చాను. అమ్మగారికి "టీ కాసివ్వమని చెప్పు..." అంటూ లక్ష్మి ముంజేతిని రెండు చేతులతో పట్టుకొని బామ్మ ముందుంచాడు అంజి.

"వాళ్ళమ్మగారొచ్చారనే సంతోషంతో వాడేం చేస్తున్నాడో వాడికే తెలియడం లేదు లక్ష్మీ! నువ్వెళ్ళి నీ పని చూసుకో వెళ్ళు" అంటూ లక్ష్మిని పంపించి వేసింది. అంజీ! లచ్చక్కకు టీ కాయడం సరిగా రాదురా. ఆ ఫ్లాస్కు తీసుకు వెళ్ళి రత్నం హోటల్లో రెండు టీ పోయించు

కురా పో... అంటూ చెంగున ఉన్న చిల్లర తీసి వాడి చేతిలో పెట్టింది. చెప్పిందే తడవుగా అంజి బయటకు పరిగెట్టాడు.

"వాడు కాసేపు ఇక్కడ ఉండకూడదనే బయటకు పంపించాను రేవతీ!"

"నాకు పెళ్ళయిన ఆరు నెలలకి ఏక్సిడెంటులో భర్త చనిపోయాడని చెప్పేను గానీ బిడ్డ సంగతి వారితో చెప్పలేకపోయానత్తయ్యా! మిమ్మల్నీ పరిస్థితిలో చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంది. ప్రస్తుతం నేనేమీ చేయలేని పరిస్థితి. అసలు "గూడెం" అనగానే వెళ్ళొద్దని ఆంక్షలు పెట్టారాయన.

"నాదేముందమ్మా... పెద్దదాన్నయిపోయాను. వాడికో ఆధారం దొరికింది. అదే పదివేలు నాకు. నిన్ను మళ్ళీ చూస్తాననుకోలేదు. నాకీ రోజు ఎంత ఆనందంగా ఉన్నదో. రేవతీ! నీ భర్త నిన్ను బాగానే చూసుకొంటారా?"

"చాలా బాగా చూసుకొంటారు".

"పిల్లలెంతమంది?"

"లేరత్తయ్యా! వ్రతాలు, పూజలు, ఎన్నో... చేస్తున్నాము".

"పోనీలేమ్మా! నీకో మంచి జీవితాన్నిచ్చాడు ఆ భగవంతుడు. నువ్వు మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలి రేవతీ! అంజి సంగతి తెలిస్తే అతని మనసు మారి నీకు దూరమవుతాడేమో!" నువ్వో పని చెయ్యమ్మా... వాడ్ని ఓ మంచి స్కూలుకు పంపించి చదివిస్తే వాడికీ ఓ మంచి భవిష్యత్తును ఇచ్చిన దానవవుతావు.

"ప్రయత్నం చేస్తానత్తయ్యా! ఇక మీదట వాడిని ఓ పని కుర్రాడిలా చూస్తూ భరించలేను. ఏదో ఒకటి చేయాలి.

"రేవతీ! నీ సంసారానికి ఆటంకం కలుగకుండా అంజి విషయంలో బాగా ఆలోచించి అడుగు ముందుకు వెయ్యి".

"సరే! అత్తయ్యా! ఆయన వచ్చే టైం అవుతోంది. వీలు చూసుకొని అప్పుడప్పుడూ వస్తూ ఉంటాను". ఈ డబ్బు ఉంచు... అంటూ వెయ్యి రూపాయలు ఆదెమ్మ చేతిలో ఉంచింది రేవతి.

"అమ్మగారూ! మీకు బ్రూ కాఫీ ఇష్టం కదా! స్ట్రాంగుగా చేయించి పట్టుకొచ్చానమ్మా... తాగండి... అంటూ కప్పులోకి వంచబోతూంటే, నేనుపోసుకొంటానులే. నువ్వలా నాయనమ్మ దగ్గర కూర్చో" అంజిని వారించింది రేవతి.

మధ్యాహ్నం భోజనం చేసి అలా నడుం వాల్చేడు రవీంద్ర.

"అయ్యగారూ! కాళ్ళు పట్టమంటారా!" రవీంద్ర కాళ్ళ దగ్గర కూర్చుంటూ అడిగేడు అంజి.

"అవునురా అంజీ! మొన్న కాళ్ళు పట్టినప్పుడు నీతో నేనేమన్నానో గుర్తుందా!"

"గుర్తుందయ్యగారూ! నాకో మంచి డ్రస్సు కొనిపెడతానన్నారు."

"ఇవిగో! ఈ తాళాలు పట్టుకెళ్ళి కార్లో ప్యాకెట్ ఉంది. పట్టుకురా!"


వాడి చురుకైన కళ్ళలోకి చూస్తూ తాళాలు అంజి చేతిలో ఉంచాడు రవీంద్ర.

ఇంటికి వచ్చేప్పుడు ఆటోలో రేవతి చెప్పిన మాటలు అంజి చెవిలో గింగురుమంటున్నాయి.

"అయ్యగారూ!"

"ఏమిటిరా!

మరే... మరి...




ఏమిటో చెప్పు.

నాకీ డ్రస్సులు, బూట్లు వద్దుగానీ, నేను బళ్ళోకెళ్ళి చదువుకొంటానయ్యా! "నన్ను చదివిస్తారా?"

మరి ఈ పనంతా ఎవరు చేస్తారురా?"

నేనే చేస్తానయ్యా! ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం స్కూలు నుంచి వచ్చాక రాత్రిదాకా పన్లన్నీ చేసి చదువుకొంటానయ్యగారూ!"

"సరే! చూద్దాంలే" ముందు ఆ డ్రెస్సు తెచ్చుకో ఫో...!

వాళ్ళిద్దరి సంభాషణా వింటున్న రేవతి "హమ్మయ్య!" అంటూ ఊపిరిపీల్చుకొంది. ఆమె మనసులో ఒక ఆలోచన... రవీంద్ర కెలాగైనా అంజి మీద ప్రేమ పెరిగేలా చేసి, వాడ్ని దత్తత తీసుకొనే ఏర్పాటు చేయాలని. "ఇది జరిగేనా?" అంతా భగవంతుడి దయ" అంటూ పూజా మందిరంలోకి వెళ్ళింది.

మరునాడుదయాన్నే తలస్నానం చేసి, రవీంద్ర ఇచ్చిన కొత్త బట్టలు తొడుక్కొని దారిలో శివాలయానికి వెళ్ళి, పనిలోకి వస్తూనే "అమ్మా! అమ్మగారూ!" అని అరిచాడు.

"ఏమిటిరా అంజీ! అమ్మగారూ అనొద్దు. "అమ్మా! అని పిలువు చాలు – ఏమిటిరా విశేషం? ఈరోజు చాలా ముద్దొస్తున్నావ్!"

"ఈ రోజు నా పుట్టినరోజని మా బామ్మ చెప్పిందమ్మా!" చేతిలోని పొట్లం విప్పి అక్షింతలు తీసి రేవతి చేతిలో ఉంచాడు. "అయ్యగారి దగ్గరకెళ్దాం రండమ్మా...!"

"నాకు అమ్మా నాన్నా లేరుగా – మీరే అమ్మగారు, నాన్నగారనుకొని ఆశీర్వదిస్తే దేవుడి దగ్గరకెళ్ళిన మా నాన్న సంతోషిస్తాడని బామ్మ చెప్పింది, రండమ్మా... అంటూ వాడు చిన్ని చేతులతో రేవతి చేయి పట్టుకొని లోపలకు తీసుకువెళ్తూంటే మంత్రముగ్ధలా వాడి వెంట నడిచింది రేవతి. ●